# దారిలో దొరికిన ప్రేమలేఖలు



– ???

*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*

## – 8–



వెన్నెలా,

సన్నని వెన్నెల జల్లుల్లో మనస్సు మాలిన్యాన్ని వదల్చుకుని సౌకుమార్యాన్ని సంతరించుకుంటుంది కదూ! అద్భుతమైన విహంగంలా రెక్కలు సాచి ఆకాశపు అంచుకి ఎగిరిపోవాలని అభిలషిస్తుంది కదూ! తళుకు తారల్లా అడవిలోకి జారిన వెన్నెలనీడల్లో, విశ్రమించాలని వెంపరలాడుతుంది కదూ! మహావృక్షాలు మౌనంగా ఆనందిస్తుంటే, ఆకుల అంచులనించి రాలే మంచుబిందువులు ముత్యాల్లా వెన్నెల్లో తళుక్కున మెరిసి ఏ గడ్డికన్నె శిరస్సు మీదనో కిరీటాలై ప్రకాశిస్తుండగా, ఆ మంచుపూలతో మాలలు కట్టి మెడలో వేసుకుని మరి మరీ మురిసిపోవాలనిపిస్తుంది కదూ! ఏ మబ్బురథంలోనో ఎక్కి వయ్యారంగా వీచే గాలికన్నెలు చెలికత్తెలు కాగా శిశిరరాణి పకపక నవ్వులతో చెట్ల ఆకులు రాల్చి, చలి కొరడాని ‘ఛళ్ళు‘మనిపిస్తూ ఝుళిపిస్తూ సాగుతూ ఉండగా, ఆనందిస్తూ.. వెచ్చదనం కోసం ప్రపంచం పరితపిస్తూ నిశ్వాసపు పొగలు విడుస్తుండగా ప్రకృతి కాంత పరిష్వంగంలో పరవశించాలనిపిస్తుంది కదూ! కనీసం ప్రకృతి అందాలనైనా భాషలో తెలియచేయలేని అల్పత్వం నాది. ఏ భావాన్ని ఏ శిల్పపు పొరలో ఇమడ్చను? ఏ అందాన్ని ఏ అక్షరమాలలో బంధించనూ? భాషా, భావమూలేని వ్యర్థజీవిని నేను. అయినా నాదైన ఆలోచనా ప్రవాహాన్ని నీ పాదాల మీదుగా ప్రవహింపచేయాలన్న తపన మాత్రం ఉన్నదని గుర్తిస్తావుకదూ!

లోకంలో అందరికీ ఎన్నో కలలు. ఎన్నో కోరికలు. ప్రకృతిలో ఎన్నో అందాలు, మరెన్నో ఆనందాలు. కానీ, అవన్నీ నాకు తెలియదు. ఆకాశమూ వెన్నెలా, పువ్వులూ ప్రకృతీ అంతా నాకు నీవే. అందుకే అన్ని అందాలలోనూ, నిండి ఉన్న నీ రూపమే నాకు మనస్సులో దర్శనమిస్తుంది. విశ్వంలోని అణువణువునా నిండి ఉన్న నిన్ను నా పిచ్చి వ్రాతలతో ఎలా బంధించను? పిడికెడు మట్టిలాంటి మనస్సుతో అనంతమైన నిన్ను అక్కున దాచుకోవాలనుకోవటం ఎంత అత్యాశ! క్షమిస్తావు కదూ! దయగల కన్నుల్లో ఒక్కసారి ఓ పరిహాసరేఖని భాసింపచేసి, తడియారని నీ పెదవుల మీద ఓ చిరునవ్వు మెరుపును మెరిపిస్తావు కదూ! నాకోసం!

లోకం అంతా ఆటస్థలమే. అందరూ పరుగులు పెడుతూనే ఉన్నారు, ఎందుకో అందుకు. ఆ పరుగు ఆపి రవంత విశ్రాంతి పొందుదామనే, పాపం వారి ప్రయత్నమూ! కానీ లోకరీతి వారిని బంధించివేస్తుంది. ఆశాపాశాలతో బంధించి వారి మనస్సులని మాత్రం కోరికల గుర్రాల్ని ఎక్కించి కళ్ళాలను తెంచి, ఒక్కపెట్టున అదిలిస్తుంది. ఆ గుర్రాలు ఎటు పరుగులు పెడితే అటే పాపం వీరి పరుగూ! ఎంత దయామయివి! నీ చల్లని చూపుల స్పర్శ అమృతంలా నన్ను తాకి చిరంజీవిని చేసింది. నీ పాదాల అరుణకాంతి నన్ను నీదగ్గరే నిలిపివేసింది. ఇపుడు పరుగులేదు. కోరికలేదు. దుఃఖంలేదు. కేవలం నాకన్నుల నిండుగా నిన్ను చూస్తూ, లోకపు మైదానాన్ని గమనిస్తూ,

నన్ను నే మరచిపోయే అదృష్టాన్ని కలిగించింది నీవే సుమా! ప్రతిఫలం ఏమివ్వగలను! నా ఆత్మను నీ పాదాలకు పుష్పంగా అమర్చడం తప్ప!

"యీలోకం భ్రాంతి", అంటూ ఓ వేదాంతి పలువరిస్తాడు. "యీ లోకమే సత్యమైనదీ, కనిపించేదే నిజం కానీ, కనిపించనిది అసత్యం," అంటూ వల్లిస్తాడో హేతువాది. "శరీరం సత్యం ఆత్మ భ్రమ" అన్నవాడొకడైతే, "అందరూ సమానులే కనుక విప్లవం వర్ధిల్లాలీ," అంటాడు మరొకడు. "జీవాత్మ వేరు పరమాత్మ వేరు," అనే పరిశీలకుడు ఒకటైతే, "అంతా ఒక్కటే", అనే ఆచార్యుడు వేరొకరు. "ఇది నీది - అది నాది", అని విడదీసే విమర్శకుడు ఒకరు, "లాల్‌సలామ్" అనే లౌకికుడు ఇంకొకడు.

అందరూ సిద్ధాంతులే. అందరివీ ప్రజ్ఞలే. సమస్యల చీకటిలో వాదపు గుడ్డి దీపాల్ని పట్టుకుని, అహంకారపు ముళ్ళబాటలమీద నడిచిపోయే పిరికివాళ్ళ ప్రపంచం ఇది. ఎక్కడ చూసినా పేదరికమే. ఎక్కడ వెదికినా పిరికిదనమే. భాషా పేదరికం. భావపు పేదరికం. ధనహీనులు ఒకరైతే దయాహీనులు ఇంకొకరు. కళ్ళల్లోంచి కలల అశృవుల్ని రాల్చుకుంటూ, ఆక్రందనతో జాలి భిక్షను అర్థిస్తూ, యీ శరీరాలు సాగిపోతూనే ఉంటాయి. ఎక్కడో ఒకచోట ఏదో ఓ చల్లని కెరటం సేద తీరుస్తుంది. 'ఉస్సు'రని నిట్టూర్చి ఓ క్షణం విశ్రాంతి కాని వేదన కౌగిలిలో ఆదమరచి నిద్రించి, మరుక్షణంలో అదాటున లేచి, మళ్ళీ భయమనే రాక్షసి వెంట తరుముకురాగా పరుగెత్తిపోతారు. అది నిలువనియ్యదు. అది నిదురపోనీయదు. అది తరుముతుంది. మృత్యుద్వారాన నిలుపుతుంది. ఎంత రక్షణ లేని జీవితాలు!

కానీ నా ప్రాణమా, వాళ్ళు ఓ రకం గుడ్డివాళ్ళు. తెలియని దానివెనుక పరుగులు పెట్టటం తప్ప, తెలిసిన సౌఖ్యం గుర్తించలేరు. ఎవరిది ఒప్పు? ఎవరిది తప్పు? అసలెందుకీ తప్పొప్పులు ఊయలలూగటం? నవ్వే పువ్వూ, పచ్చని ప్రకృతీ నీలినీలి ఆకాశమూ నిర్మలమైన నదీనదాలూ, గంభీరపు సముద్రాలూ పరమాద్భుత హిమ పర్వత శిఖరాలూ, తళుకుతారా వెండి వెన్నెలా, కోయిల పాటా నెమళ్ళ ఆటా, శిశువుల అల్లరీ, పశువుల అమాయకత్వం, ఇవన్నీ శాంతికి చిహ్నాలు కావా? ఇవన్నీ విశ్రాంతికి నిలయాలు కావా? మొదట నేనూ పిచ్చివాడ్నే! నీ గోటి అంచుల కాంతిరేఖలు నా కన్నుల్ని పవిత్రం చేశాక నా ప్రాణమా, యీ లోకం అద్భుతమై నిలిచింది. గుండెలో విశ్రాంతి పొంగిపొరలి ప్రవహించింది. అపుడు చూశాను నిజంగా నిన్ను! అప్పుడు తెలిసింది ఆనందపు నిజస్వరూపం! ఎంత అద్భుతమూర్తివి! కనుసన్నలతో కాలాన్ని శాసించే మహారాణీ, ఏ సుమాలతో నీ పాదాల్ని అలంకరించను?

భావావేశం ఉబుకుతున్నా, భాషాలేమిత్వం నన్ను నిస్సహాయుడిని చేస్తోంది.

అయినా అర్థం చేసుకోగలిగే నీ హృదయానికి, ప్రాణంలేని అక్షర శిలాపుష్పాలెందుకు?

అయినా తపన వీడదు. చూశావా, కోరిక మనిషిని ఎలా బంధిస్తుందో! మరోసారి ఓ చిరునవ్వుని పెదాలపై వెలయించవూ! మరోసారి నీ పాదస్పర్శతో నా హృదయాన్ని పవిత్రం చేయవూ!

నీ

-X-



*(వచ్చేనెల మరో ప్రేమలేఖ)*

Post your comments